# 6. ఇదీ ముగింపు

"సుఖం లేని బతుకయిపోయింది. ఈ చావు చచ్చే కంటే భూమ్మీద మన ఎకౌంట్‌ని క్లోజ్ చేసుకోవటమే ఉత్తమం" తనను తాను శపించుకుంటూ అన్నాడు శ్రీపతి. బాల్కనీ గోడ కానుక్కూర్చుని దినపత్రికను చదువుతున్నాడతను. మందు దట్టించిన ఫిరంగిలా వున్నాడు.

"ఇప్పుడేమయింది?" అని సౌమ్యంగానే అడిగాను.

కొన్నాళ్లుగా శ్రీపతి ఇట్టాంటి అభిప్రాయాలే ప్రకటిస్తున్నాడు. మొన్నోరోజున జరిగిన విషయాన్ని చాలా తీవ్రంగా చెప్పాడు. 'కడుపు రగిలిపోతోంది'. చెన్నై నుంచీ మర్నాటి ఇంటర్వ్యూకి కాల్‌లెటర్ ఈరోజు అందేటట్లు పోస్ట్ చేశారట. పోస్ట్ వారి ముద్రలూ మొదలైన ఋజువుల్ని అన్నీ చెప్పి కంపెనీ వాళ్ళని నానా తిట్లు తిట్టాడు ఫోన్‌లో. "రాదలచుకుంటే ఫ్లైట్‌లో రావచ్చుగా అంటాడు ఆ గొట్టంగాడు" అని బూతు పురాణాన్ని లంకించుకున్నాడు. ఊపిరితిత్తుల్లో సత్తువ అణగిన తర్వాత "బెటర్ ఐ కిక్‌ద బకెట్ ఐసే" అన్నాడు. అందుకనే ఇప్పుడేం జరిగిందా అని సహానుభూతితోనే అడిగాను.

నావైపు ఆదోలా చూసి చెప్పుకొచ్చాడు శ్రీపతి. "మా అమ్మలో దుర్మార్గం, ఉన్మాదం ఎదురులేని పెత్తనం చేస్తున్నయ్ మూర్తీ. ఒక కంట్లో బెల్లం, ఒక కంట్లో సున్నం బాపతు. అగ్గిపూలనే ఎప్పుడూ రాలుస్తుంది. రెండో కొడుకంటే పడి ఛస్తుంది. వాడో బంగారుకొండ అనీ, నేనో కొరగాని కొడుకునని ఆమె ఈసడింపు. ఇప్పుడు తనకు వొంట్లో బాగోలేదు వచ్చి పొమ్మని కబురు. తీరా వెళ్తే నేనామెకు పైసా ఇవ్వననీ, బతుకంతా నాకు నిరుద్యోగమేననీ సూటీపోటీ మాటలు. నా పరిస్థితేమో ఛార్జీలకే అష్టదిక్కులా చెయిసాచే కర్మ" అని "అమ్మల్ని గురించి అడ్డమైన గ్లామర్ రాతలు రాస్తారు కదా మీరు, మా అమ్మగురించి వాస్తవం రాయకూడదూ?" అంటూ నా వైపు చూపులు గుచ్చాడు.

శ్రీపతి తమ్ముడు రామ్మూర్తితో వోసారి వాళ్ళమ్మ వైద్యం కోసం హైదరాబాద్‌వచ్చింది. నిమ్స్‌లో ఏవో టెస్ట్‌లు చేసి అల్సరని తేల్చారు. అప్పుడు

చూశాను నేనామెను. మనిషి మునమునలాడుతూవుంది. శ్రీపతి అంటే చులకన భావం, చిరాకు. అందుకనే అతనికి తల్లి పట్ల అంత నిరసనా, కోపం.

శ్రీపతి 'లో- అలజడి'ని అర్థం చేసుకోగలను నేను. కానీ, గొంగట్లో భోజనం చేస్తున్న మధ్యతరగతి చిన్న గుమాస్తాని నేను. అందునా కంపెనీ నాకు ఆరువేలిచ్చి పదివేలకి నెలనెలా రసీదు తీసుకుంటుంది. మా లాంటి వాళ్ళది మరో కథ! కాకుంటే కాస్తంత సమాజ 'వాస్తవాన్ని' గుర్తించగలిగాన్నేను. కనుకనే 'స్థిత ప్రజ్ఞుణ్ణయ్యాను' కాబోలు!

"ఈ వార్త విను- ఫన్నీ!" అనుకుంటూ "ధరల పెరుగుదల ప్రజల కొనుగోలు శక్తి పెరగటం వల్లనేనట. గ్రేట్! రాజకీయం" అన్నాడు.

నేను గతుక్కుమని, అతని మొహంకేసి చూశాను. కందగడ్డలా వుంది. పళ్ళు కొరుకుతూ, పిడికిళ్ళు బిగించుకుంటున్నాడు. నా మనసు కలవరపడింది. రౌతు కమ్చీ దెబ్బలు తిని తిని కూలబడిన గుర్రంలా వున్నాడు. బతుకు పట్ల నైరాశ్యమంతా అతనిలో ముద్దగట్టి వుంది. నేను విచారంగానూ, విసుగ్గానూ కూడా "అందుకే స్వామీ. నిన్ను పేపర్ చూడకు అంటున్నాను వినవు కదా" అన్నాను.

"స్టుపిడ్!" అని పేపర్‌ని నేలమీద కొట్టి "నిరుద్యోగి పేపర్ చూడటమూ మానేస్తే ఇక అది వాడికి చరమాంకమే" అంటూ లేచి విసురుగా బాత్‌రూమ్‌లోకి జొరబడ్డాడు.

శ్రీపతి ఊరికి వెళ్ళలేదు. అప్పు పుట్టలేదు. ఆ వారంలోనే హైదరాబాద్‌లో ఏదో కంపెనీలో ఇంటర్వ్యూ వచ్చింది శ్రీపతికి.

అతని ఇంటర్వ్యూ రోజున నేను మా ఆఫీస్ పనిమీద విజయవాడ వెళ్ళాను. నాలుగో రోజున తిరిగొచ్చాను. నే వచ్చేసరికీ శ్రీపతి రూమ్‌లో లేడు.

ఆరాత్రి -

శ్రీపతి కోసం ఎదురుచూసి చూసి, నా తిండి ముగించుకుని నిద్రపోయాను.

ఒక రాత్రి వేళ మెలకువ వచ్చి చూస్తే - బాల్కనీలో శ్రీపతి. గోడకి జారగిలబడి ఆకాశంలోకి చూస్తున్నాడు. పిలిస్తే ఉలుకూ, పలుకూ లేదు. దగ్గరికి వెళ్ళి భుజం మీద చెయ్యేసి కదిపాను. తల తిప్పాడు. ముఖం నిండా చెమట

పట్టి వుంది. ఏడ్చి ఏడ్చి అలసినట్లున్నై కళ్లు. శోష వచ్చినవాడిలా జావగారుతున్నాడు. నాకు గుండె దడదడలాడింది. భయమూ దబాయించింది.

శ్రీపతిని పట్టుకుని నడిపించి - రూమ్‌లో నేల మీదగోడవారగా పరచివున్న అతని బొంతమీదికి చేర్చాను. పడుకోబెడితే పడుకున్నాడు. గ్లాసుతో నీళ్ళు తాగించి, గబగబా బయటికి పరుగెత్తాను. దగ్గర్లోని చాయ్‌బండి నుంచి తెచ్చిన బ్రెడ్ ముక్కలు తినిపించి పాలు తాగించాను. ప్రాణం లేచొచ్చింది. 'ఫర్వాలేదు' అన్నట్లు చెయ్యి చూపాడు. క్షణాల తర్వాత, "నిన్నా ఈ రోజూ తిండి లేదు. అంతే. ఖంగారేం లేదు" అని నీరసంగా, లోగొంతుకతో అని పక్కమీద వాలాడు. "అయినా నీకేం వర్రీ అఖ్ఖర్లేదు. నాకు నేనుగా ఎగరేస్తే తప్ప ఈ హంస లేచిపోదు" అని ఓ వేదాంతి నవ్వు నవ్వాడు.

శ్రీపతి గురించిన భయంతోనూ, అతని మాటల్లోని ఆంతర్యం గురించిన ఆలోచనతోనూ నాకింక ఆ రాత్రికి నిద్ర పట్టలేదు.

ఆ మర్నాటినుంచీ శ్రీపతిలో చాలా మార్పు వచ్చింది. అతని ప్రవర్తన వింతగా మారింది. మాటల ధోరణిలో కొత్త కొత్త అర్థాలూ ధ్వనించసాగాయి.

ఉన్నట్టుండి వాళ్ళ అమ్మ గురించి చెబుతూ, "తల్లి చేతనే ఛీకొట్టించుకునే బతుకెందుకు బ్రదర్. చచ్చిపోతేనే బెటర్" అంటూ మొహాన్ని చేతుల్లో దాచుకుని ఏడ్చేవాడు.

ఇంటర్వ్యూ భాగోతాల్ని గురించీ, అక్కడ జరిగే అవినీతి గురించీ, దగా గురించీ పిచ్చి పిచ్చిగా మాట్లాడేవాడు. "అంతా నాటకమే. నువ్ మాకు పనికిరావని చెప్పటానికి లక్షా తొంభై బోలు కబుర్లు. కంపెనీకి కావలసిన దానికీ, అభ్యర్థికి తెలిసిన దానికీ మధ్యన చాలా 'వైడ్ గేప్' అంటాడు. ఇంకో కంపెనీకి అనుభవం కావాలి. కొత్త నిరుద్యోగికి అనుభవం ఎక్కడ్నుంచీ వస్తుంది? బతకటానికి చేతిలో విద్య వుండాలంటే నిజమనుకున్నాం గానీ, పెనం మీంచి పొయ్యిలో పడతామని ఊహించలేదు. అక్కరకు రాని చదువు, నో హోప్స్. లాస్ట్ సీన్‌ని ప్లాన్ చేసుకోవటం అవసరం" అని తల విదిలించి, చేతులు ఆడిస్తూ వుండేవాడు.

నా మనసంతా గజిబిజి అయిపోతోంది. లోకం ఇలా వున్నందుకు బాధపడాలో, మనుషుల్ని మనుషులు వంచిస్తున్నారని ఏడవాలో తెలియటం లేదు. శ్రీపతి-'యాంగ్రీయంగ్‌మేన్'-డిప్రెషన్‌లోకి జారుకుంటున్నాడు. మాటకీ, నడతకీ పొంతనలేని పిచ్చితనం కనిపిస్తోంది.

ఆవేళ - శనివారం

సాయంత్రం పెందరాళే రూమ్ కొచ్చాను. శ్రీపతి లేడు. ఏం చేయాలో తోచటం లేదు. నిరాసక్తమైన మనసు. ఏదో ఆలోచిస్తూ, రూమ్‌లో తలుపు పక్కన శ్రీపతి సూట్‌కేసుమీది పాత మేగజన్లలో ఒకదాన్ని తీసుకున్నాను. విడి కాగితాలు జలజలా రాలాయి.

నేలమీద కూచుని వాటన్నిటినీ ఏరాను.

అన్నీ వన్‌సైడ్ పేపర్లు. ఒకవైపు ఏదో అచ్చు మేటర్. రెండోవైపు స్కెచ్‌పెన్‌తో శ్రీపతి చేతి రాత.

చదవసాగాను.

'బతుకు పట్ల ఇంత వ్యామోహం ఎందుకో?'

'ఉద్యోగం, హోదా, డబ్బు, సంపదా, గౌరవం- వీటికి అర్థం వుందా? పోనీ అంతం వుందా?'

'కుడి ఎడమల దగా దగా అయితే - జీవించటం అవసరమా? బుద్ధి రాలేదా? ఇంకా బతికి బట్టకడతాననే ఆశేనా?' 'లోకానికి సిగ్గులేదు; నీకూ లేదు!'

నేను గతుక్కుమన్నాను. విస్తుపోయాను.

నిదానంగా మరికొన్ని కాగితాల్నీ తిరగేశాను.

"ఇంకా ఏదో శుభమూ, మంచీ జరుగుతాయని ఆశించటం -స్టుపిడిటీ! ఏ జనం ఆందోళనలోనో, అలజడుల్లోనో కలిసిపోయి ఆత్మహత్యకి తలపడితే - వ్రతం చెడ్డా ఫలం దక్కుతుంది. అమ్మని సంతృప్తి పరచే మార్గం బహుశా ఇదేనేమో!"

నాకు గుండెలు జారినై. ముఖాన్న చెమట కురిసింది. ఠక్కున ఆ కాగితాల దొంతరని మళ్ళీ అదే మేగజైన్‌లో పెట్టి సరిచేశాను. నా చాపమీద కూర్చుని మొహం తుడుచుకున్నాను.

ఆ రాత్రి రూమ్‌కి రాలేదు శ్రీపతి. మర్నాడు ఉదయం పదిన్నరవుతుంటే వచ్చాడు. మాసిన ప్యాంటూ, షర్టూ, మొహాన్ని వైరాగ్యంలో ముంచి తీసినట్లున్న వాలకం. శరీరానికి వార్థక్యాన్ని తొడిగినట్లుంది. నేను ఏమీ అడక్కుండానే చెప్పాడు. "నిన్న జీడిమెట్ల వెళ్ళాను. పేకేజింగ్ కంపెనీకి వాకిన్ ఇంటర్వ్యూ. అందులో నా

క్లాస్‌మేటొకడున్నాడు. వాడు ప్రయత్నం చేశాడుగానీ, మనమే పనికి రాలేదు" అంటూ కూచున్నాడు.

క్షణాల తర్వాత, "విధివెక్కిరిస్తుంటే ఎవరైనా ఏం చేస్తారు?" అంటుంటే అతని కళ్ళల్లో నీళ్ళు నిలిచినై. ప్రయత్నపూర్వకంగా వాటిని అడ్డుకోబోయినా సాధ్యం కాలేదు. మొహాన్న నరాలు ముడిపడినై. దుఃఖంతో ఏడవసాగాడు. "ఇంక ఈ ప్రయత్నాలన్నీ అనవసరం. ఈ కత్తులబోనులోకి నేపోలేను. ఇంకా ఈ జీవితం మీద మమకారం... స్టుపిడిటీ! సులువుగా 'దిఎండ్' అనే మార్గం చూసుకోవాలి" అని "అవునూ, ముక్కు మూసుకుంటే మూడు నిముషాలుంటారు కదా- నిజంగా ప్రాణం పోతుందా బ్రదర్?"అని పసిపిల్లవాడిలా అడిగాడు.

నేనో వెర్రివాడిలా అతని కళ్లల్లోకి చూశాను. అతని ప్రశ్నలో నాకు చాలా హెచ్చరికలు వినిపించాయి. అతని కాగితాల్లోని రాతలూ నా కళ్లముందు నిలిచాయి. శ్రీపతి మనసులోని నైరాశ్యానికీ, చచ్చిపోదామనే అతని ఆలోచనకీ - చుక్కపెట్టే విరుగుడు వెయ్యకపోతే మనిషి దక్కడనిపించింది. అదాటున నా మేథలో ఒక మెరుపు మెరిసింది.

"ఇవన్నీ నిదానంగా మాట్లాడుకుందాం. నాకు ఆకలిగా వుంది పద" అంటూ బయల్దేరదీశాను. పెద్దగా అడ్డుచెప్పకుండా నన్ను అనుసరించాడు.

శంకరమఠం దాకా నడిచి ఆ పక్కన 'ఫాస్ట్‌ఫుడ్' లో అటు టిఫినూ, ఇటు భోజనమూ కాకుండా ఏదో తిన్నాం. ఆ పూటకి చాలు. అరకాఫీ అయింది. పేవ్‌మెంట్‌మీదికొచ్చాం. పక్కగా నిలబడ్డాం.

నా పక్కగా నేలమీద కాళ్ళులేని మొండంలాంటి మనిషి! ముద్దలా వున్నాడు. మూపున గూని. నీటితో నింపిన బెలూన్‌లా తల అవిరళంగా కదులుతోంది. అతని ముందు పరచిన మాసిన చీర ముక్క. దానిమీద కొన్ని చిల్లర నాణేలు. అడుక్కుంటున్నాడు- చేతులతో ఈతకొడ్తున్న వాడిలా. శ్రీపతి చూసేటట్టుగా, వంగి రూపాయి నాణెం వేశాను.

ముందుకు కదిలాం. ఎండదబాయిస్తోంది. వొళ్ళు చిరచిరగా వుంది. నాలుగడుగులు పడినై. ఆగాను.

చెట్టు కింద చిన్న చెక్కబల్ల. దానిమీద అట్టపెట్టెల్లో- మింటో ఫ్రెష్‌లూ, నిమ్మతొనలూ, పప్పుండలూ, పాన్‌మసాలా దండలు. పక్కన పది సిగరెట్

ప్యాకెట్‌లూ. బల్ల వెనగ్గా స్టూలుమీద ముసలి అవ్వ. కావాలని వక్కపొడి ప్యాకెట్ కొని కదిలాను. చూస్తున్నాడు శ్రీపతి.

పదిగజాల దూరం నడిచేసరికి, నడకకి అడ్డంగా చక్రాల బండి. దానిమీద దొంతరలు దొంతరలుగా – ఆకర్షణీయమైన రంగులు వేసిన మట్టి హుండీలున్నై. గుమ్మటాల్లా వున్నై. శ్రీపతితో 'చూడు' అన్నాను. చూశాడు. పిల్లలు డబ్బు దాచుకునే ముంతల్లాంటివి అవి.

సిగ్నల్స్ దాకా నడిచాం. మా వైపు ఎఱ్ఱదీపం. ఆగాం. వాహనాలన్నీ ఆగి వున్నై. ఒక చేతిలో పసిగుడ్డుతో, మరో చేతిలో క్లీనింగ్ క్లాత్ బొత్తితో – చకచకా కార్ల దగ్గరికి పరిగెత్తుతూ, కొనమని ప్రాధేయపడుతోంది వో యువతి. శ్రీపతి గమనించాలని 'పాపం – పాతికేళ్ళులేని పిల్ల' అన్నాను. అతనూ ఆమె వైపు చూశాడు. 'ప్చ్' అన్నాడు. తల చిత్రంగా తిప్పి 'మిజరబుల్' అని కదిలాడు.

సిగ్నల్ దాటి తిన్నగా విద్యానగర్‌లో రూమ్ కొచ్చాం.

ఒళ్ళంతా చెమట. చిరాగ్గా వుంది. షర్ట్‌లు తీసి, బాల్కనీ గోడమీద గాలికి ఆరేసి, అక్కడే స్టూల్స్ మీద కూచున్నాం.

పదినిమిషాల తర్వాత నిమ్మళంగా చెప్పటం మొదలెట్టాను.

"చూడు శ్రీపతీ, కొన్నాళ్ళనుంచీ నువ్ పేపర్లో వార్తలమీదా, సామాజిక దురన్యాయాల మీదా, నీ వ్యక్తిగత అవస్థల మీదా – పొగలూ, సెగలూ కక్కటం చూస్తూనే వున్నాను. జీవితానికి ఏదో చరమగీతం పాడాలనే గమ్యాన్ని నిర్దేశించుకుని, నీ నడకని ఆ గమ్యానికి చేర్చాలని పరిపరివిధాల ఆలోచిస్తున్నావ్. అయితే, సమయం, సందర్భం ఎప్పుడా అని తలపట్టుకుంటున్నావ్" అవునా – అన్నట్లు అతని కళ్ళల్లోకి చూసి, అతని సమాధానం ఆశించకుండా కొనసాగించాను.

"నీ సమస్యలూ, మనసూ తెలిసినవాణ్ణి" అన్నాను. అతను సర్దుక్కూచున్నాడు. నే చెప్పాలనుకున్నది చెప్పసాగాను. "పెద్ద పెద్ద ఉపన్యాసాలివ్వను. నేలమీది మనిషి ముద్దనిచూశాం. చెట్టుకింద అవ్వని చూశాం. బండిమీది మట్టి వస్తువుల వ్యక్తినీ చూశాం. క్లీనింగ్ క్లాత్‌ల యువతినీ చూశాం. వాళ్ళందరికీ ఎందుకీ బతుకుమీది ఆశ? అసలు వాళ్ళా జీవిక ద్వారా రోజుకు పొందుతున్నది– ఎందుకు సరిపోతుంది? ఆలోచించు. వాళ్ళని చూస్తుంటే – బతికుండగానే ఎలుకలు కొరికేసిన మనుషుల్లా లేరూ? అయినా, ఆ కళ్ళల్లో ఎంతటి జీవనలాలస?"

చెప్పటం ఆపి శ్రీపతి కళ్ళల్లోకి చూశాను. అతని చూపులు వినీలాకాశం వేపు పర్చి వున్నై.

"ఒకవేళ - వాళ్ళంతా మరెవరి చెప్పుచేతల్లోనో 'కూలి'కి పని చేస్తున్నారనే వాదనని తెచ్చుకున్నా-అది ఇంకా దారుణమూ, దుర్భరమూ గదా? అప్పుడు అసలే వద్దు ఈ ముష్టి బతుకులు అనుకోవాలి కదా? కానీ, అలా లేదే?! బతికేస్తున్నారు. బతుకుని బహుశా వరంగా భావిస్తున్నారు- తమకే విద్యా, విచక్షణా, విచికిత్సా లేకున్నా! అదీ బతుకు రహస్యం! నిజానికి వాళ్ళంతా ప్రపంచంతో నిమిత్తం లేని వాళ్ళలా అనిపించటం లేదూ? కానీ ప్రపంచంలో, ఈ వ్యవస్థలో, ఈ ప్రవాహంలో ఈదుతున్నారు". "మంచికా, చెడుకా" - వంటి ప్రశ్నలు నీవంటి నావంటి అర్ధజ్ఞానులకి. వాళ్ళకి ఆ సందేహాలే రావు. అందుకని చావు - ఏ సమస్యకీ పరిష్కారం కాదు. అయినా, కార్యకారణాలు రెండూ నీ పరిధిలోలేవు. వాటిని గురించి ఆలోచించి - బుర్ర ఖరాబు చేసుకుని చద్దామనుకోవటం - వివేకమేనా?" అని అక్కడ ఆపి, నేను వెళ్ళి నా చాపమీద పడుకున్నాను. శ్రీపతి తన ఆలోచనల్లో తాను కూరుకు పోయాడు.

❖ ❖ ❖

శ్రీపతి నాతో చాలా ముభావంగా వుంటున్నాడు. అతని పిచ్చి చూపులు, పరధ్యానం, తలవిదిలింపులు, గాలిలో చేతుల్తో ఆడటం, పళ్ళు కొరుక్కుంటూ మొహం మునమునలాడటం, తనలో తాను మాట్లాడుకుంటూ వుండటం, మొత్తం నడత - అన్నింటినీ గమనిస్తుంటే అతని అంతరాంతరాల్లో అలజడీ ఆలోచనలు సుడి తిరుగుతున్నట్టు అర్థం చేసుకుంటూనే వున్నాను. నేనేదన్నా మాట్లాడబోయినా తప్పించుకుపోతున్నాడు. రాత్రుళ్ళు ఏవేవో కాగితాలు ముందేసుక్కూచుని ఆలోచనలతో నిద్రకాస్తున్నాడు.

పది రోజులైంది.

ఆవేళ, నేను నిద్రలేచేసరికీ శ్రీపతి రూమ్‌లో లేడు. ఆ రోజేకాదు, ఆ తర్వాత వో వారం రోజులు శ్రీపతి అయిపులేడు. ఆందోళన పడసాగాను. ఫోన్ తీసేశాడో, తీయటం మానేశాడో తెలీదు. 'స్పందించుట లేదు' వస్తోంది. ఇంటికి వెళ్ళాడేమో అనుకున్నాను.

ఆదివారం వచ్చింది. శ్రీపతీ వచ్చాడు. పెద్దగా మాటలు లేవు. "నేను జీడిమెట్ల మా ఫ్రెండ్ రూమ్‌కి మారుతున్నా" అని తన వస్తువులు సర్దుకున్నాడు.

కారణం అడిగితే, "జస్ట్ లైక్ దట్" అని వూరుకున్నాడు. నేను వొత్తిడి చెయ్యలేదు. ఆ రాత్రి మెస్‌లో భోజనం చేశాము. అతని ఫ్రెండ్ ఫోన్ నంబర్ అడిగితే, నవ్వి, "నాతో ఇప్పటికే ఎంతో అవస్థపడ్డావ్. ఇంకా ఎందుకులే. అతనితో నా గురించి మాట్లాడే అవసరం రాకుండా జాగ్రత్త పడతానులే" అన్నాడు. అతని మాటల్లోని ఆంతర్యం అర్థం కాక అయోమయంగా చూస్తూ వుండిపోయాను.

సోమవారం ఉదయం - వెలుగురేకలు చీకటి మరకల్ని చెరుగుతున్న వేళ. అప్పుడు వెళ్ళిపోయాడు శ్రీపతి.

* * *

ఆర్నెల్లు ఇట్టే తిరిగిపోయినై.

ఈ ఆర్నెల్లల్లోనూ నా ఉద్యోగంమారింది. కొంచెం పెద్ద జీతంలో పడ్డాను. అమ్మ బలవంతాన పెళ్ళికి ఒప్పుకొని, పెళ్ళిచూపులకి బందరు వెళ్ళి ట్రయిన్‌లో తిరిగొచ్చాను. సికందరాబాద్ స్టేషన్‌లో దిగాను. చేతుల్లో లగేజి వుంది. బయటికొచ్చి ప్రీపెయిడ్ ఆటో క్యూలో నిలబడ్డాను.

తెలతెలవారుతోంది. ఎముకలు కొరికేచలి. నాముందుకొచ్చి నిలిచింది ఆటో. డ్రైవర్‌ని పోల్చుకున్నాను. అతను శ్రీపతి! సంతోషంతో మనసు పొంగింది. 'రా.... అంతా తెలుస్తుంది' అని ముందుకు కదిలాడు.

దారిలో చాలా మాట్లాడాడు. కొత్త మనిషీ, కొత్త జీవితం!

నా ప్రయత్నం వృధా కాలేదు- అని ఊపిరి పీల్చుకున్నాను.

ఇప్పుడు వెలుగు రేకలు బాగా పొడుచుకొస్తున్నాయి.!!

**(చినుకు, డిశంబరు, 2013)**